క్లుప్తంగా

సన్మానం



టేకుమట్ల: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో మహిళ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న దీప్తి ఇటీవల డీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఎన్నికైంది. కాగా శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఆమెకు ఎస్సై గొగికారి ప్రసాద్ శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ పరీక్షకు సిద్ధమవుతున్న తరుణంలో ఆమెకు వెసులుబాటు కల్పించి ఉపాధ్యాయురాలుగా ఎన్నికయ్యేందుకు సహకరించమన్నారు. డీఎస్సీలో ర్యాంక్ సాధించేందుకు సహకరించిన ఎస్సై, ఏఎస్సైలకు దీప్తి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై కుమారస్వామి, పోలీస్ సిబ్బంది సుమన్, లవకుమార్, వెంకటేష్, పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



కాటారం: మండలంలోని ధన్వాడ గ్రామంలో నిర్వహించిన ధన్వాడ ప్రీమియర్ లీగ్ తొమ్మిదవ సీజన్ ఫైనల్స్ శుక్రవారం ముగిశాయి. ఫైనల్‌లో మహి 333 జట్టు, సాన్వి జట్టు హోరాహోరిగా తలపడి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు విజేతలకు మండల కాంగ్రెస్ నాయకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, సీనియర్ నాయకులు కామిడి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుతో జీపీకి ఆదాయం



టేకుమట్ల: ఇంటి పన్ను, నీటి పన్ను, వ్యాపార సముదాయ పన్నులు చెల్లిస్తే గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయం వస్తుందని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ప్రాపర్టీ పన్నును పంచాయతీ కార్యదర్శి సాంబశివరావుకు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా ప్రాపర్టీ పన్ను చెల్లించి గ్రామ పంచాయతీకి సహకరించాలన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామాభివృద్ధిలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తారని ప్రతీ ఒక్కరు వారికి సహకరించాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్సై అమరేందర్‌రెడ్డి ఉన్నారు.

సీనియర్ కార్యకర్తలకు అన్యాయం

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ఉన్న సీనియర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలను ఎవరు పట్టించుకోకపోవడంతో తీవ్ర అన్యాయం జరుగుతుందని సీనియర్ నాయకుడు కంచేర్ల రాంబాబు ఆవేదన వ్యక్తం చేస్తూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న మమ్ముల్ని గ్రామ శాఖ అధ్యక్షుడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి చేరిన వారికే ప్రాధన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎమ్మెల్యే, మండల నాయకులు చర్య తీసుకోవాలని కోరారు.

సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించాలి

ములుగు: జిల్లాలో వెంటనే సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు మండలంలోని అన్నంపల్లి సమీపంలో పత్తిపంటలను శుక్రవారం ఆయన పరిశీలించి, మహిళా రైతులతో మాట్లాడి ఇబ్బందులను తెలుసుకున్నారు. కురిసిన వరుస వర్షాలతో పత్తిపంటలో సరైన దిగుబడి రాలేదన్నారు. దీనికి తోడు అవసరానికి అమ్ముకోవడానికి ముందుకు వస్తున్న రైతుల సమస్యలను ఆసరాగా చేసుకొని మధ్య దళారులు తక్కువ ధరతో కొనుగోలు చేసి జేబులు నింపుకుంటున్నారని అన్నారు. సీసీఐ కొనుగోలు చేస్తే క్వింటాకు రూ.7500 మద్దతు ధర లభిస్తుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులు ఇంత ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా మొద్దునిద్రలో ఉండిపోతుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 56వేల ఎకరాల్లో రైతులు పత్తి నష్టపోయారని వారికి రూ. 56కోట్ల నష్టపరిహారాన్ని అందించాలని అన్నారు. మెనిఫేస్టోలో పేర్కొన్న విధంగా క్వింటాల్‌కు రూ.475 బోనస్ అందించి రైతులను ఆదుకోవాలని అన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..

- వంతెనల వద్ద కుంగిన రోడ్డు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



పంకెన వాగు వంతెన వద్ద కుంగిన రహదారి

పలిమెల: మండలంలోని పంకెన సమీపంలో గల పంకెన వాగు, తీగల వాగు వంతెనపై ఏర్పడిన గుంతలు, ఇరువైపులా కుంగిన రోడ్డుతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సుమారు 5 సంవత్సరాల క్రితం పంకెన వాగుపై రూ.6.50 కోట్లు, తీగల వాగుపై రూ.2.50 కోట్లతో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో వంతెనలు నిర్మించారు. ఆ సమయంలో మహదేవపూర్ నుంచి పలిమెల వరకు 30 కి.మీ మేర రోడ్డు సైతం నిర్మించారు. కాగా పంకెన వద్ద గల పంకెన వాగు, తీగల వాగు వద్ద వంతెనలు నాసిరకంగా వేయడంతో ఐదు సంవత్సరాల్లోనే వంతెనపై కంకర తేలి గుంతలు ఏర్పడుతున్నాయి. నిత్యం వందలాది వాహనాలు, ఆర్టీసీ బస్సులు ఈ వంతెనలు ఉన్న రోడ్డు మార్గాన ప్రయాణాలు సాగిస్తుంటాయి. రాత్రి పగలు తేడా లేకుండా ప్రయాణిస్తున్న సమయంలో ఇలా గుంతలు ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు మండల కేంద్రం నుంచి పంకెనకు వెళ్లి వస్తుండగా వర్షం పడుతుండటంతో తీగల వాగు వంతెనపై ఏర్పడి గుంతలో నీరు నిల్వడంతో గుంతలో పడి ప్రమాదానికి గురికావడంతో చేయి విరిగింది.

పట్టించుకోని అధికారులు

నిత్యం ఇదే దారులగుండా ప్రయాణించే జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు ఇన్ని గుంతలు ప్రత్యక్షంగా చూసిన, ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిసున్నారు. కనీసం సంబంధిత శాఖ అధికారులు గుంతలు పూడ్చి మట్టి పోయించాల్సింది పోయి చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వెంటనే జిల్లా స్థాయి ఉన్నతాధికారులు రోడ్లకు మరమ్మతులు చేపట్టి స్థానికులు ప్రమాదాల బారిన పడకుండా చర్య తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి



పంకెన సమీపంలోని పంకెన వాగు, తీగల వాగు వద్ద ఏర్పడిన గుంతలు, వంతెనలకు ఇరుపక్కలా కుంగిన రోడ్డును వెంటనే మరమ్మతు చేపట్టేలా జిల్లా ఉన్నతాధికారులు చర్య తీసుకోవాలి. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించేలా ప్రజాప్రతినిధులు వారిపై ఒత్తిడి తీసుకురావాలి.

– జనగాం మధుకర్, పలిమెల



తీగల వాగు వద్ద నాసిరకం నిర్మాణంతో తేలిన కంకర



తీగల వాగు రోడ్డుపై ఏర్పడిన గుంత

ఎల్ఆర్ఎస్‌ను పకడ్బందీగా కొనసాగించాలి



ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వీరభద్రయ్య

కాటారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పకడ్బందీగా కొనసాగించాలని డీఎల్‌పీఓ వీరభద్రయ్య సూచించారు. కాటారం మండలంలో కొనసాగుతున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియను శుక్రవారం డీఎల్‌పీఓ పరిశీలించారు. ఎల్ఆర్ఎస్ జరుగుతున్న తీరు, నమోదు చేసుకుంటున్న వివరాలపై ఆరా తీశారు. పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఎలాంటి సందేహాలు చోటు చేసుకున్న వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. ప్రతీ దరఖాస్తును పరిశీలించి వివరాలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఏ ఒక్క ఎల్ఆర్ఎస్ దరఖాస్తు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. డీఎల్‌పీఓ వెంట ఎంపీఓ వీరస్వామి, ఇరిగేషన్ ఏఈఈ రాజేశం, పంచాయితీ కార్యదర్శులు షగీర్ ఖాన్, నాగరాజు, రాజశేఖర్, సురేశ్, నవ్యశ్రీ, జ్యోష్న, లక్ష్మి, గంగాధర్, కుమారస్వామి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదుపై అవగాహన



ఓటరు నమోదు ప్రారంభిస్తున్న నాయకులు

కాటారం: అర్హత కల్గిన ప్రతీ ఉపాధ్యాయుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనడానికి ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయూటీఎస్ మండల ప్రధాన కార్యదర్శి అనపర్తి తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, నమోదుపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజమాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఉపాధ్యాయుడు ఓటు వినియోగించుకోవాలని తెలిపారు. 2018 నుంచి 2024 వరకు మూడు సంవత్సరాల కాలం ఉన్నత పాఠశాలలో సర్వీస్ పూర్తి చేస్తుకున్న ఉపాధ్యాయుడు ఓటర్ నమోదుకు అర్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూఎస్ కార్యదర్శి గీత, రమేశ్, కాంప్లెక్స్ హెచ్ఎం ఉమారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి వినయ్ అన్నారు. శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మరికాల, ఎదిర, తిప్పాపురం, చొక్కాల, వీరభద్రవరం గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్యులు సోహేల్, ఆశిష పవన్, సిబ్బంది జ్యోతి, సత్యనారాయణ ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



అక్రమంగా తరలిస్తున్న పశువులు

ఏటూరునాగారం: డీసీఎం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మండల కేంద్రంలోని చెక్ పోస్టు వద్ద తెల్లవారుజామున వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ఏపీ 16 సీఏ 3656 గల కారు, టీఎస్ 12 వీటీ 4046 గల డీసీఎం వాహనం ఒకదాని వెనుక ఒకటి వేగంగా పోవడాన్ని గమనించామన్నారు. డీసీఎం వాహనాన్ని నిలిపివేసి పరిశీలించగా అందులో 22 పశువులు ఉన్నాయన్నారు. పశువులకు తరలించేందుకు సంబంధించిన ఆధారాలు ఏమీ లేకపోవడంతో డీసీఎం వాహనంతో పాటు ముందు కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో ఏటూరునాగారం గ్రామానికి చెందిన కన్నెబోయిన శ్రీను గత కొంతకాలంగా పశువులను అక్రమ రవాణా చేస్తున్నాడన్నారు. అదేవిధంగా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన ఆత్కూరి రవీందర్, ఏటూరునాగారం మండలం దొడ్ల కొత్తూరు గ్రామానికి చెందిన జైస్లావత్ కుమార్, ములుగు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన కొడాలి కృష్ణ, ఉచిత శ్రీను అనే ఐదుగురుపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. పశువులను అక్రమంగా తరలించొద్దని తరలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

వెంకటాపురం(ఎం): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పాలంపేటలో భూక్య జవహర్‌లాల్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టగా ఆయన హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు వివరిస్తూ మద్దతు కూడబెట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీమంతుల రవీంద్రాచారి, జినుకల కృష్ణాకర్‌రావు, నగరపు రమేశ్, మండల నాయకులు పత్తి నాగేశ్వర్‌రావు, భూక్య సుధీర్, ప్రభు, శరత్, అన్వేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లోనే ఎంపిక చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): పీసా గ్రామ సభల ద్వారానే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక సరైన పద్ధతి కాదని ఏజెన్సీ ప్రాంతాల్లో ఏజెన్సీ చట్టాలకు అనుగుణంగా ఎంపిక చేయాలని అన్నారు. ఏజెన్సీలో పూర్తి హక్కులు పీసా గ్రామసభలకే ఉంటుందని అన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మొదటి ప్రాధాన్యత గిరిజన కుటుంబాలకు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే ఇచ్చిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనితి వెంకట కృష్ణ, పూనెం ప్రతాప్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



డ్రెయినేజీని శుభ్రం చేస్తున్న సిబ్బంది

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీలో శుక్రవారం పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది డ్రెయినేజీలను శుభ్రం చేయడంతో పాటు గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అనంతరం చెరుకూరు గ్రామ పంచాయతీలోని శ్మశాన వాటిక, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



సీఎంఎఫ్ఆర్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



ఏఈఈలతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: సీఎంఆర్ఎఫ్ పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. నియోజకవర్గంలోని భూపాలపల్లి పట్టణం, రూరల్ మండలంతో పాటు గణపురం మండలంలోని పలు గ్రామాలకు చెందిన మొత్తం 52 మంది లబ్ధిదారులకు రూ.36 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు.

ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేయాలి

ఉద్యోగులు క్రమశిక్షణ అంకితభావంతో పనిచేసి ప్రజలు మన్ననలు పొందాలని నూతనంగా విధుల్లో చేరిన పీఆర్ ఏఈఈలకు ఎమ్మెల్యే సత్యనారాయణరావు సూచించారు. కొత్తగా పంచాయతీరాజ్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(ఏఈఈ) లుగా విధుల్లో చేరిన ఉద్యోగులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ఏఈఈలను అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఏఈఈ లు పుట్టపాక నిరంజన్(భూపాలపల్లి రూరల్), దొర్ల మానస రెడ్డి(రేగొండ సబ్ డివిజన్), గూడెపు వర్షిత (గణపురం), కట్ల అరుణ(చిట్యాల) ఉన్నారు.

వినతిపత్రం అందజేత

విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ కన్వర్షన్ సాధన కమిటీ జిల్లా చైర్మన్ తిప్పారపు రాజు, కన్వీనర్ మోత్కూరి కోటి ఆధ్వర్యంలో కార్మికులు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును మర్యాదపూర్వకంగా కలిసి ఆర్టిజన్స్ కార్మికుల కన్వర్షన్ పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ యాల్ల సురేందర్ రెడ్డి, ఎండీ అంకుషావలి, కోకన్వీనర్ కోసరి భాస్కర్, రాజేందర్ మద్దెల కృష్ణమూర్తి తదితర కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్య తీసుకోవాలి

కాటారం: జాతీయ రహదారిపై ఓవర్‌లోడ్ ఇసుక లారీల కారణంగా ఏర్పడిన గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన రామిళ్ల రాజబాబు హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో శుక్రవారం దరఖాస్తు చేశారు. ఇసుక లారీల ఓవర్ లోడ్‌ల కారణంగా కాళేశ్వరం నుంచి భూపాలపల్లి వరకు రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. గుంతలను గమనించక వాహనదారులు అదుపుతప్పి పడిపోయి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని దరఖాస్తులో పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

భూపాలపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. గణపురం మండలం జంగుపల్లి గ్రామానికి చెందిన వేముల మనిప్రసాద్(20) బుధవారం భూపాలపల్లి మండలం పెద్దపురం గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలి



ములుగు: ప్రతిభ చూపిన విద్యార్థులతో ఎంఈఓ శ్రీనివాసులు

ములుగు: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలని ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా కేంద్రంలో బాలుర పాఠశాలలో మండలస్థాయిలో పాటలు, నృత్యం, చిత్రలేఖనం వంటి ఆరు అంశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందనలు తెలిపారు. మండలస్థాయిలో మొదటి స్థానంలో నిలిచివారు నేడు(శనివారం) జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలలో పాల్గొంటారని అన్నారు. డీసీఈబీ సెక్రటరీ సూర్యనారాయణ, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మల్లారెడ్డి, ఎంఎన్‌ఓ తిరుపతి పాల్గొనగా న్యాయనిర్ణేతలుగా హమీద్, ప్రమీల, లవనిక, ఝాన్సీ వ్యవహరించారు.

మంగపేట: మండలస్థాయి కళాఉత్సవ్ ప్రతిభా పోటీలలో పలు పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబర్చి విజేతలుగా నిలిచారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ పొదెం మేనక ఆధ్వర్యంలో మండల స్థాయి కళాఉత్సవ్ పోటీలను 06 అంశాలపై శుక్రవారం నిర్వహించారు. పోటీలలో మండలంలోని 06 పాఠశాలకు చెందిన 53 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రూపుడ్యాన్స్‌లో కమలాపురం జెడ్పీ పాఠశాలకు చెందిన 09వ తరగతి విద్యార్థిని లీసో టీమ్, డ్రామాలో 10వ తరగతి విద్యార్థిని అక్షర టీం, సోలోడ్యాన్స్‌లో రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి భాస్కర్, డ్రాయింగ్, పేయింటింగ్‌లో రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఉదయ్ అత్యుత్తమ ప్రతిభ చాటారు. వీరందరు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని ఎంఈఓ మేనక తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీపీ మల్లారెడ్డి

టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన అక్కల మాదవ్ గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి శుక్రవారం కుటుంబాన్ని పరామర్శించారు. మాదవ్ మృతదేహానికి నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. అలాగే మండలంలోని దళిత సంఘాల నాయకులు మాదవ్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓదెలు, ఆకునూరి తిరుపతి, చంద్రమౌళి, రాంచందర్, సంపత సంగి రవి, తదితరులు ఉన్నారు.